**అయినవా** ళ్ళందరికీ కబుర్లు వెళ్ళినాయి.కొడుకులూ, కోడళ్ళూ,'హాతుళ్ళూ అల్లుళ్ళూ, మనమళ్ళూ, మనమరాళ్ళూ వచ్చారు. అంతా హడావిడిగా ఉంది. సుందరమూర్తి బెడ్‌మీద పడి ఉన్నాడు అచేతనంగా. కాని, అతని మనస్సుమాత్రం పనిచేస్తూనే ఉంది, ఎప్పటికన్నా చురుకుగా. పక్కగదిలో అందరూ'పారాయణం'లో ఉన్నట్లున్నారు. నవ్వులు. చలోక్తులు జోరుగా వినబడుతున్నాయి.

''అయితే ఓడిపోయిన పార్టీ గెలిచిన పార్టీని సినిమాకు తీసుకెళ్ళాల్రా. అదీ పందెం'' అంటున్నాడు పెద్ద అబ్బాయి.

''వట్టి సినిమాకైతే నేను రాను. డిన్నరు కూడా'' అంటున్నాడు ఇంటల్లుడు.

''బావగారి ధ్యాస ఎప్పుడూ తిండిమీదే'' అంటూంది చిన్నకూతురు.

అందరు గొల్లున నవ్వారు.

ఇవతలి గదిలో సుందరమూర్తి మూతిమీద వాలిన ఈగను తోలుకోటానికి నానా ప్రయాసపడుతున్నాడు. ఒకటే దురద పుట్టేస్తుంది. తోలుకునేందుకు చేతులు లేవు. అవి రెండు రోజుల క్రితం జరిగిన బస్సు ప్రమాదంలో నజ్జునజ్జు అయ్యాయి. ప్రాణానికే ప్రమాదం అన్నారు గవర్నమెంటు ఆసుపత్రిలో.




వేళ్ళుల్ని అక్కడి వరకు తీసేస్తే మిగిలిన భాగానికి ఎఫెక్టు ఉండదు అని సలహా ఇచ్చారు. అంతా కలసి పదివేలు. అంతే! కంపెనీ వాళ్ళ రూల్సు ప్రకారం రెండు వేలు మాత్రం ఇచ్చారు. మిగిలిన ఎనిమిది వేలు? పెళ్ళాం మెడలో పుస్తె మినహా మరి ఏమీలేదు పుట్టింటివారిచ్చిన బంగారం సంసార రథానికి తైలంగా మారి పోయిందెప్పుడో. అన్ని పాట్లూ అప్పుడు పడబట్టే పెద్దవాడు ఇప్పుడు ఇన్‌కమ్ టాక్సు ఆఫీసరు, చిన్నవాడు బాంకు ఆఫీసరు కాగలిగారు. ఇద్దరు కూతుళ్ళను చెరో పదివేలతో పై అంతస్తుల్లోకి తోసేసరికి చనుకు ఉండడానికి ఇల్లు కూడా లేకపోయింది. చేసే ఉద్యోగమే జీవనాధారం. ఈ పరిస్థితిలో ఆఖరివాణ్ణి ఇష్టం లేకపోయినా ఏదో ప్రయివేట్ కంపెనీలో గుమాస్తాగా ఇరికించవలసి వచ్చింది. దానికి వాడి కెంత కోపమో తనమీద! అందుకే తనకిలా ప్రమాదం జరిగిందని— టెలిగ్రాం ఇచ్చినా, అందరిలాకాకుండా ఆఖర్న వచ్చాడు. రేపే పోవాలంటున్నాడు సెలవు లేదనే వంకతో!

దీర్ఘంగా నిట్టూర్చాడు సుందరమూర్తి. గంట క్రితం అదేగదిలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది. ''నాన్నగారి ఆపరేషన్‌కు చాలా

రెండు వేలు ఇచ్చుకోవాలిరా" అంది సుందరమూర్తి భార్య సుగుణమ్మ, అందరికి కాఫీలు అందిస్తూ.

"అరే! ఆ సంగతి ముందే ఎందుకు అనలేదు? పోయిన నెలలోనే పదివేలు అప్పు చేశాను. మళ్ళీ అప్పివ్వరు" అన్నాడు పెద్దవాడు. సుందరమూర్తికి నవ్వు వచ్చింది. నాన్నా! నువ్వు పోయిన నెలలోనే చేశావు ఎందుకు వినిగ్గోట్టుకోలేదు! అని అడిగినట్లనిపించింది ఆయనకు. అయినా పెద్దవాడి తత్త్వం ఆయనకు తెలియనిదికాదు. 'వాడిప్పుడు అచ్చంగా మామగారి అడుగుజాడల్లోనే పోతున్నాడు. మామగారి రికమండేషన్ వల్ల ప్రమోషన్ సంపాదించుకున్నాడయ్యె మరి! అయినా సుగుణకు వాడిమీదే ప్రేమ జాస్తి. తగిన శాస్తి చేశాడు అనుకున్నాడు సుందరమూర్తి.

సుగుణమ్మ వెర్రి మొహం వేసుకుని రెండవ వాడివైపు తిరిగింది. వాడు వేలాడేసుకున్నాడు. "ఇంత అర్జంటుగా పదివేలంటే నా ఒక్కడివల్లా అవుతుందా? నా వంతు రెండువేలు ఇచ్చుకోలేను గాని, వెయ్యి రూపాయలు సర్దగలను" అని పెళ్ళాం వైపు చూసి బిటుకుబిటుకుమంటున్నాడు. ఈ వెయ్యి రూపాయలు ప్రామిస్ చేసినందుకు పడకగదిలో పెళ్ళాం చేత ఎన్ని చివాట్లు



- కర్లపాలెం హనుమంతరావు

తినాలో? అనీ అతని భయం. పెద్ద అల్లుడు—"కొడుకులు మీరు అట్లా అనడం బాగులేదోయ్! అంత డబ్బు మీ దగ్గరలేకపోతే ప్రస్తుతానికి నేను సర్దుతాను. వాయిదాల మీద తీర్చండి" అన్నాడో, లేదో పెద్ద కూతురు అందుకుంది. "అవ్వ! బావ మరుదులకు అప్పిస్తానంటారా! లోకం నవ్విపోతుంది. అయినా మీ దగ్గర అంత డబ్బున్నట్లు నాకు తెలియదే! ఉంటే ఇవ్వండి నాకు. పిల్లదాని మెడ చాలా బోసిగా ఉంది. ఏదన్నా చేయించిపెడతాను. అయినా చెల్లెలికి మొన్న పెళ్ళిలో అమ్మ ఇచ్చిన గొలుసు ఉందిగా? అది ఏ బాంకులో తాకట్టు పెట్టినా రెండు వేలు రాకపోవు. ఏమే, శాంతా?" అని బాణం రెండవ కూతురు వైపు తిప్పింది. గుడ్లు ఉరిమి చూస్తున్న మొగుడి వైపు చూసి బిటుకుబిటుకుమంటూ నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది శాంత.

అంతా గమనిస్తున్న సుగుణమ్మ ఇంక కన్నీళ్ళు ఆపులేక వంటింట్లోకి వెళ్ళి కుమిలి కుమిలి ఏడ్చింది. 'ఛీ! వీళ్ళు బిడ్డలా! వీళ్ళకోసమా తాము జీవితాన్నంతా తగులబెట్టుకుంది!' పరిస్థితి గమనించి సుందరమూర్తే సర్ది చెప్పాడు అందరికీ.

"మీరు అనవసరంగా బాధపడకండర్రా — నాకు సహాయం చేయ లేనందుకు. పదివేలు ఖర్చు పెట్టుకొని ఈ చేతులు బాగు చేయించుకున్నా నాకు ఒరిగేదేముంది? ఎలాగో ఇంకో రెండేళ్ళలో రిటైర్ అవబోతున్నాను. కాస్త ముందే అయినా ననుకుంటాను. ఇదేమీ మనసులో ఉంచుకోకుండా ఇక్కడ ఉన్న నాలుగురోజులు సరదాగా ఉండి వెళ్ళండి. అదే నాకు కావాలి. మీ అమ్మ మాటలు పట్టించుకోకండి. అది ఒట్టి పిచ్చిది!" అని అటు తిరిగి పడుకొన్నాడు సుందరమూర్తి.

ఎప్పుడు వచ్చాడో లక్ష్మీనారాయణ అంతా విన్నాడు, గుమ్మం మీద నిలబడి, అందరూ వెళ్ళిన తరవాత—"చూశావా, సుందరం? నే నానాడే చెప్ప లేదూ? ఈ కాలం కుర్రసజ్జే అంత. వీళ్ళను నమ్ముకుని మనం మన విలువైన జీవితాలను కర్పూరంలా ఖర్చు పెట్టుకుంటాం" అని విరక్తిగా నవ్వుతూ మంచం దగ్గిరికి వచ్చాడు.

"పోనీలేరా, లక్ష్మీ! కన్నందుకు వాళ్ళను అభివృద్ధిలోకి తీసుకు రావటానికి మన జీవితాలను ఖర్చు పెట్టుకోవట మనేది గొప్ప త్యాగమేమీ కాదు. అది ధర్మం. పశుపక్ష్యాదులల్లో మాత్రం ఈ సూత్రం లేదూ? ప్రతిఫలం ఆశించి మనం పిల్లలను పెంచి పెద్ద చేయం కదా! ఎవరి అదృష్టాదృష్టాలను బట్టి వాళ్ళకు అవి ప్రాప్తమవుతాయి. నా అదృష్టం ఇది" అని పేలవంగా నవ్వాడు సుందరమూర్తి.

"నీ వెర్రి వేదాంతం నాకు చిన్నప్పటినుంచే తెలుసు కనక, నువ్వెలాగూ వృద్ధాప్యంలో ఇలాంటి ఇబ్బందులు పడతావని స్వానుభవం మీద నాకు తెలుసు కనక ఏడేళ్ళ క్రితం నీ దగ్గిర అప్పు అని తీసుకున్న రెండు వందలు నీకు తెలియకుండానే నీ పేర ఏక్సిడెంట్ పాలిసీ తీసుకున్నా. లెక్క ప్రకారం నీ కిప్పుడు పన్నెండు వేలు వస్తాయి. ఈ ఫారాల మీద సంతకం పెట్టు" అంటూ లక్ష్మీ నారాయణ ఫారాలు బయటికి తీశాడు.

"లక్ష్మీ! నీ కెందుకురా నా మీ దింత ప్రేమ!" అని భోరుమని ఏడ్చేశాడు సుందరమూర్తి, అప్పటి దాకా అదిమి పట్టుకున్న దుఃఖోద్వేగానికి తట్టుకోలేక.

"పిచ్చి! నువ్వు నా స్నేహితుడివి కనక. తండ్రివి కాదు కనక" అని నవ్వి, ఫారాలు తీసుకుని వెళ్ళిపోయాడు లక్ష్మీనారాయణ.

లక్ష్మీనారాయణ, సుందరమూర్తి బాల్య మిత్రులు. వృద్ధాప్యం దాకా స్నేహ మాధుర్యాన్ని పంచుకుంటున్న అపూర్వ స్నేహితులు. లక్ష్మీనారాయణ ఒక ఇన్సూరెన్సు కంపెనీలో ఆఫీసరుగా పని చేస్తున్నాడు కనక రెండు రోజుల్లోనే క్లెయిమ్ సెటిల్ చేసి చెక్ పట్టుకు వచ్చాడు సుందరమూర్తి ఇంటికి.

"లక్ష్మీ! ఈ చెక్ ఎన్‌కాష్ చేసి పది వేలూ ఈ ఆఖరి వాడికి ఇచ్చేయి!" అన్నాడు సుందరమూర్తి.

"నీ కేం పిచ్చి పట్టలేదు కదా!" అని కోపంగా అరిచాడు లక్ష్మీనారాయణ, అక్కడే ఉన్న మూడవ కొడుకు రాజు వైపు అనుమానంగా చూస్తూ.

"వాడేదో. . . స్కూటరు కొంటాడుటరా. అది వాళ్ళ జనరల్ మానేజరుకు ప్రెజెంటు చేస్తే తొందర్లో ఆఫీసరు ప్రమోషను వస్తుందని ఆశ పడుతున్నాడు. వాడికి మాత్రం ఇంక నేను ఎందుకు ఎందుకు ఏమి సహాయం చేయగలను? అన్నయ్య లిద్దరూ పెద్ద హోదాల్లో ఉండి, వాడు గుమాస్తాగిరీ చెయ్యటం వాడికి మాత్రం చిన్నతనం కదూ? ఏదో నోరు విడిచి అడిగాడు, ఆ చెక్ వాడిపేర జమ చేసేయ్."

"మరి మీ సంగతేమిటండీ?" లబలబ లాడుతున్న సుగుణమ్మ వంక తిరిగి, "సుగుణా! లక్ష్మీ నిన్న డాక్టరు దగ్గిరికి వెళ్ళి వచ్చాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆపరేషన్ చేస్తే అసలు ప్రాణానికే ముప్పు అని చెప్పాడుట. కదురా, లక్ష్మీ!" అని స్నేహితుడి వంక తిరిగి నవ్వేసరికి అనుకోకుండానే లక్ష్మీనారాయణ తల వూపేశాడు అవు నన్నట్లు.

★